

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

ప్రజాశక్తి-అనంతపురం

జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియట్ పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. పరీక్షల నిర్వహణకు సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. జిల్లా వ్యాప్తంగా ఇంటర్ మొదటి సంవత్సరం 24,446 మంది, ద్వితీయ సంవత్సరం 17,110 మంది పరీక్షలు రాయనున్నారు. 58 కేంద్రాల్లో పరీక్షలు జరగనున్నాయి. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. ఇప్పటికే విద్యార్థులకు ఆన్‌లైన్ ద్వారా ఇంటర్‌బోర్డు హాల్‌టికెట్లను జారీ చేసింది. శుక్రవారం నాడు పరీక్షలు ప్రారంభం అయ్యి ఈ నెల 20వ తేదీ ముగుస్తాయి. ఇప్పటికే పరీక్షలకు నిర్వహణకు సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. ప్రతి కేంద్రానికి ఒక చీఫ్ సూపరింటెండెంట్, డిపార్టుమెంటల్ అధికారులను నియమించారు. పరీక్షా కేంద్రాలను నిరంతరం తనిఖీ చేసేలా ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించారు. విద్యార్థులు గంట ముందుగా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచించారు.

పాలసేకరణపై ప్రత్యేక దృష్టి

◆ మహిళా పాడి రైతులకు రుణాలు ◆ కలెక్టర్ ఎం.గౌతమి



పాలవెల్లువ కార్యక్రమాన్ని పరిశీలించి, పాడి రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఎం.గౌతమి

ప్రజాశక్తి-ఆత్మకూరు

జగనన్న పాలవెల్లువ కింద పాలసేకరణపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఎం.గౌతమి అధికారులను ఆదేశించారు. గురువారం నాడు ఆత్మకూరు మండలంలోని వడ్డిపల్లి, పంపనూరు తండాల్లో ఎఎంసియులలో జగనన్న పాలవెల్లువ కింద చేపడుతున్న పాలసేకరణను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న పాలవెల్లువ కింద పాలసేకరణ ద్వారా కలిగే ప్రయోజనాలను క్షేత్రస్థాయిలో మహిళా పాడి రైతులకు వివరించాలన్నారు. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఎఎంసియులలో అమూల్ సంస్థకు పాలుపోయడం ద్వారా కలిగే ప్రయోజనాలపై పాల ఉత్పత్తిదారులకు తెలియజేయాలన్నారు. మార్చి 1వ తేదీన చాలా కీలకమైన రోజని, అన్ని ఎఎంసియులకు కేటాయించిన లక్ష్యానికి అనుగుణంగా పాల సేకరణ జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. జగనన్న పాలవెల్లువ కింద మహిళా పాడి రైతులకు విస్తతస్థాయిలో రుణాలు అందించాలన్నారు. పశువులు కొనుగోలు చేసేందుకు రుణాలను అందించా లన్నారు. పాడిపశువులు కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల అడాప్షన్ అధికారి, డీఆర్డీఏ పీడీ నరసింహా రెడ్డి, రూట్ ఇన్‌ఛార్జి రమాదేవి, ఎంపిపి హేమలత, వడ్డిపల్లి సర్పంచి లక్ష్మీనారాయణ రెడ్డి, పంపనూరు తండా సర్పంచి ఎర్రిస్వామి, వెటర్నరీ అధికారులు దిలీప్, తులసీరామ్, ఏపీఎం మదన్ మోహన్, ప్రమోటర్స్ ధనలక్ష్మీ, నాగరత్నమ్మ, ప్రభాకర్, సచివాలయ ఉద్యోగులు, మహిళా పాడి రైతులు పాల్గొన్నారు.

తేలని ఎంపీ అభ్యర్థి

◆ టిడిపిలో కొనసాగుతున్న ఉత్కంఠ
◆ బికె. పార్థసారథి స్థానం ఎటు..
◆ జెసి.పవన్‌కు మళ్లీ అకాశం దక్కేనా.!

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికలకు సమయం ఆసన్నమవుతోంది. అభ్యర్థులను ప్రధాన పార్టీలన్నీ ప్రకటిస్తున్నాయి. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఇప్పటికే సగానికిపైగా స్థానాలపై స్పష్టతవచ్చింది. అధికార వైసిపి ఏడు అసెంబ్లీ, రెండు పార్లమెంటు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. ఇక టిడిపి తొమ్మిది అసెంబ్లీ స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించింది. ఇంకా పార్లమెంట్ స్థానాల్లో అభ్యర్థుల ప్రకటన జరగలేదు. అనంతపురం, హిందూపురం పార్లమెంట్ స్థానాల్లో ఎవరిని బరిలో దింపనుందన్నది చర్చనీయాంశంగా మారింది. పొత్తుల్లో భాగంగా హిందూపురం పార్లమెంట్ స్థానాన్ని బిజెపికి ఇచ్చే అవకాశాలున్నట్లు ప్రచారం నడుస్తోంది. ఈ మేరకు బిజెపి నేతలు కూడా తామంటే తాము పోటీలో ఉంటామని ప్రకటనలు చేస్తున్నారు. ఇదే క్రమంలో సత్యసాయి జిల్లా టిడిపి అధ్యక్షులుగానున్న బికె.పార్థసారధికి పెనుకొండ అసెంబ్లీ టిక్కెట్టును ఈ సారి ఇవ్వలేదు. ఆయన్ను హిందూపురం ఎంపీగా నియమిస్తారన్న ప్రచారమూ ఉంది. అయితే ఆయన అసెంబ్లీ వైపే మొగ్గు చూపుతున్నారు. పొత్తులో హిందూపురం పార్లమెంట్ బిజెపికి ఇస్తే ఆయన్ను ఎక్కడి నుంచి బరిలో దింపుతారన్నది ఆసక్తికరంగా మారింది. ఒకవైపు



జెసి.పవన్‌కుమార్ రెడ్డి

ఆన్‌లైన్ సర్వేలో అనంతపురం అర్బన్ బికె.పార్థసారధి అయితే ఎలాగుంటుందని సర్వే నిర్వహించడం మరో ఆసక్తికరమైన అంశంగా మారింది. ఈ సర్వే అనంతపురం అర్బన్ పార్టీ ఇస్తోందా లేక సాధారణమైన సర్వేనేనా అన్నది తెలియాల్సి ఉంది.ఈ పరిస్థితుల్లో అనంతపురం పార్లమెంట్‌కు ఎవరు టిడిపి అభ్యర్థి అన్నది ఆ పార్టీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. 2019 ఎన్నికల్లో జెసి.పవన్‌కుమార్ రెడ్డి పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేశారు. తొలిసారిగా రాజకీయ అరంగేట్రం చేసిన పవన్‌కుమార్‌రెడ్డి ఆ ఎన్నికల్లో ఓటమి చెందారు. ఈ



బికె.పార్థసారధి

ఎన్నికల్లో తిరిగి ఆయనకే ఇస్తారా.. లేక కొత్త వారి వైపు చూస్తారా అన్నది తెలియాల్సి ఉంది. వైసిపి మాత్రం అనంతపురం అభ్యర్థిగా మాజీ మంత్రి శంకర నారాయణ పేరును ప్రకటించింది. ఆయనే అభ్యర్థి అయ్యే అవకాశముంది. సాధారణంగా అనంతపురం పార్లమెంటుకు ఎప్పుడూ బీసీలు అయితే బోయ సామాజిక తరగతికి చెందిన వారినే నియమిస్తారు. 2019లో ఆ రకంగా తలారి రంగయ్యను అభ్యర్థిగా నిలిపి జెసి.పవన్‌కుమార్‌రెడ్డిపై విజయం సాధించారు. ఇప్పుడు టిడిపి కూడా మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు బరిలో దింపే ఆలోచన చేస్తోందని ప్రచారం నడిచింది. అయితే రాయదుర్గం అసెంబ్లీకే తిరిగి ఆయన్ను బరిలో నిలిపింది. ఈ మేరకు ఆయన పేరును టిడిపి అధిష్టానం ప్రకటించింది. కాలవ రాయదుర్గంకు వెళ్లడంతో అనంతపురం పార్లమెంటుకు జెసి.పవన్‌కుమార్‌రెడ్డి అభ్యర్థిగా ఉంటారన్న చర్చ నడుస్తోంది. జెసి.పవన్ కుమార్‌రెడ్డి ఇప్పటి వరకు జిల్లాలో తానే అభ్యర్థినని చెప్పిన దాఖలాల్లేవు. గతకొంతకాలంగా ఆయన జిల్లాకు దూరంగానే ఉంటూ వస్తున్నారు. పార్టీ కార్యక్రమాల్లోనూ పాల్గొనడం లేదు. అభ్యర్థిగా ప్రకటన వెలువడిన తరువాతనే వస్తారా లేక కొత్త అభ్యర్థి అయితే ఎవరన్నది టిడిపిలో చర్చ నడుస్తోంది. హిందూపురం పొత్తుల్లో బిజెపికిపోతే అనంతపురం అభ్యర్థి బరిలో బీసీ ఉంటారా లేక ఓసీ ఉంటారా .? అన్నది తేలాల్సి ఉంది.

ప్రజాసేవకే రాజకీయాల్లోకి..: అమిలినేని

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

ప్రజాసేవ చేసేందుకే తాను రాజకీయాలోకి అడుగుపెట్టానని, ఇంతటి అవకాశం కల్పించిన టిడిపి అధినేత చంద్రబాబుకు కృతజ్ఞతలు అని కళ్యాణదుర్గం టిడిపి అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు అన్నారు. కళ్యాణదుర్గం టిడిపి టికెట్ కేటాయించిన తర్వాత సురేంద్రబాబు గురువారం మొట్ట మొదటిసారిగా భారీ కాన్వాయి, వేలాది మంది అభిమానులు, కార్యకర్తలతో నియోజకవర్గంలోకి అడుగుపెట్టారు. సుమారు 500 వాహనాలతో జిల్లాకేంద్రం నుంచి భారీ ర్యాలీగా తరలివచ్చారు. ముందుగా రహదారిలో ఆత్మకూరు మండలం పంపనూరు సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నియోజకవర్గంలోని గోళ్ల పంచాయతీ పరిధిలో ఉన్న సిబాయి గ్రామంలో సర్పంచి కవిత బొజ్జన్న ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తర్వాత సిబాయి గొల్ల పాత చెరువు, బోరంపల్లి, ఒంటిమిది గ్రామాల మీదుగా వచ్చి అక్కమాంబ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కాన్వాయి మండల పరిషత్ కార్యాలయం వద్ద రాగానే



సురేంద్రబాబుకు స్వాగతం పలికేందుకు భారీగా తరలివచ్చిన కార్యకర్తలు

అభిమానులు గజమాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం స్థానిక షిరిడీ సాయి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఎన్టీఆర్ భవన వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి అంబేద్కర్, మహాత్మా గాంధీ, వాల్మీకి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సురేంద్రబాబు మాట్లాడుతూ తాను ప్రజలకు సేవ చేసేందుకు నిరీక్షిస్తున్న నేపథ్యంలో టిడిపి అధినేత చంద్రబాబు కళ్యాణదుర్గానికి అవకాశం కల్పించడం సంతోషకరంగా ఉందన్నారు. అధినేత, ప్రజలు తమపై ఉన్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా జీవితకాలం కళ్యాణదుర్గం నియోజకవర్గ ప్రజల్లో ఒక్కడిగా ఉంటూ సేవలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సీనియర్ నాయకులు మోరేపల్లి మల్లికార్జున, రామ్మోహన్‌చౌదరి, లక్ష్మణ్‌చౌదరి, వైపి రమేష్, పాపంపల్లి రామాంజనేయులు, నరసాపురం మురళి, సురేష్, గోళ్ల వెంకటేశులు, గోళ్ల రమేష్, నియోజకవర్గ పరిధిలోని కళ్యాణదుర్గం, కంబదూరు, కుందుర్పి, శెట్టూరు, బ్రహ్మసముద్రం మండలాల భారీగా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదల జీవితాలతో వైసిపి చెలగాటం

'జగనన్న కాలనీ' నిర్మాణాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం : కాలవ

ప్రజాశక్తి-రాయదుర్గం

జగనన్న కాలనీలు నిరుపేదల పాలిట శాపంగా మారాయని, వైసిపి నాయకులు నాసిరకంగా ఇళ్లను నిర్మించి పేదల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు మండిపడ్డారు. పట్టణంలోని 32వ వార్డు మల్లాపురం లేఅవుట్‌లో గృహ ప్రవేశానికి ముందే కూలిన ఇంటిని గురువారం కాలవ పరిశీలించారు. విలేకరులతో మల్లాపురం లే అవుట్‌లోని జగనన్న కాలనీలో నాసిరకంగా ఇళ్లు నిర్మించడం వల్లే గృహ ప్రవేశానికి ముందే పైకప్పు కూలిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. హేమజ్యోతికి పిఎంఎవై పథకం కింద పక్కా ఇల్లు మంజూరైందన్నారు. ప్రభుత్వమిచ్చే రూ. 1.8 లక్షలకు తోడు ఆమె కుట్టు మిషన్ ద్వారా సంపాదించిన రూ. 1.30 లక్షలను వైసిపి 30వ వార్డు కౌన్సిలర్ భర్త గోరంట్ల సత్యనారాయణకు ఇచ్చారన్నారు. అయితే అతడు నాసిరకం గా ఇంటిని నిర్మించాడని, అది ప్రవేశానికి ముందే కూలడం కాంట్రాక్టర్ స్వార్థానికి సాక్ష్యంగా నిలుస్తోందన్నారు. కొత్త ఇంట్లో చేరాలన్న ఆ కుటుంబం ఆశలపై నీళ్లు చల్లారన్నారు. టిడిపి హయాంలో కేంద్రం రూ. 1.50 లక్షలు రాయితీ ఇస్తే, రాష్ట్ర ప్రభుత్వం రూ. లక్ష సమకూర్చేదన్నారు. చంద్రబాబు సర్కార్ 2 సెంట్ల స్థలంలో అన్ని రకాల సదుపాయాలతో పక్కా ఇళు నిర్మించిందన్నారు. వైసిపి నాయ కుడు పట్టణంలో వందకు పైగా ఇళ్లు నిర్మిస్తున్నారని, వాటిపై విచారణ జరిపిస్తామని తెలిపారు. నాసిరకంగా నిర్మిస్తున్న జగనన్న ఇళ్లపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని కాలవ హెచ్చరించారు. కాల వ వెంట టిడిపి పట్టణ అధ్యక్షుడు నాగరాజు, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి కరేగౌడ మంజునాథ గౌడ్, వార్డు ఇన్‌ఛార్జి రాజశేఖర్, బిసి సెల్ తిప్పయ్య, శంకర్, చెన్నవీర, తిప్పేస్వామి, శివ, శంకర్, ఎల్లప్ప, సత్తి పాల్గొన్నారు.



మల్లాపురం లేఅవుట్‌లో పైకప్పు కూలిని ఇంటిని పరిశీలిస్తున్న కాలవ శ్రీనివాసులు

గుంతకల్లు రైల్వే డివిజన్ పేరు మార్పు తగదు

విద్యార్థిసేన అధ్యక్షుడు అబ్దుల్‌భాసిద్

ప్రజాశక్తి-గుంతకల్లు

బ్రిటీష్ కాలం నాటి ఉన్న గుంతకల్లు రైల్వే డివిజన్ పేరును మార్చవద్దని విద్యార్థిసేన నాయకులు డిమాండ్ చేశారు. రైల్వేబోర్డు గుంతకల్లు రైల్వే డివిజన్ పేరును మార్పు చేసే ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ గురువారం రైల్వే జంక్షన్ కేంద్రం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థిసేన అధ్యక్షుడు అబ్దుల్‌భాసిద్ మాట్లాడుతూ గుంతకల్లు జంక్షన్ డివిజన్ పేరును బాలాజీ డివిజన్ పేరుగా మార్చాలని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదన చేయడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికే వెనకబడిన రాయలసీమలో రాష్ట్ర విభజన అనంతరం రావాల్సిన రైల్వేజోన్ విశాఖపట్నానికి తరలించారన్నారు. ఇప్పుడు గుంతకల్లు డివిజన్ పేరును మార్చి బాలాజీ డివిజన్‌గా ఏర్పాటుకు చేయడాన్ని గుంతకల్లు ప్రజలు వ్యతిరేకిస్తున్నారన్నారు. రాయలసీమ ప్రాంత ప్రజల అభిప్రాయం తీసుకోకుండా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాజకీయ లబ్ధి కోసం తప్ప వేరే ఉద్దేశం లేదన్నారు. గుంతకల్లు పేరును ఎప్పటిలాగే ఉంచాలని లేనిపక్షంలో భవిష్యత్తులో పెద్దఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిసేన జిల్లా కార్యదర్శి మహేష్ గుప్తా, నాయకులు జయసింహా, సాయి, వీరన్న, మహబూబ్, సుందర్, సుధాకర్, రైల్వే ఆటో డ్రైవర్లు, తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న విద్యార్థిసేన నాయకులు

నిష్పక్షపాతంగా వ్యవహరించాలి

స్త్రీశిశు సంక్షేమ శాఖ పీడీ శ్రీదేవి

ప్రజాశక్తి-నార్పల

అంగన్వాడీ కార్యకర్తలు విధుల నిర్వహణలో నిష్పక్షపాతంగా వ్యవహరించాలని స్త్రీశిశు సంక్షేమ శాఖ పీడీ శ్రీదేవి సూచించారు. గురువారం మండల పరిధిలోని బి.పప్పూరు గ్రామంలో సెక్టార్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ సెంటర్లలో గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు పౌష్టికాహారాన్ని పరిపూర్ణంగా పంపిణీ చేయాలన్నారు. గర్భిణులు, బాలింతల పట్ల శ్రద్ధ వహించి బరువు, హిమోగ్లోబిన్ స్థాయిలు పెరిగేందుకు చర్యలు చేపట్టాలన్నారు. వచ్చిన స్టాకును ఎప్పటికప్పుడు లబ్ధిదారులకు పంపిణీ చేయాలన్నారు. రిజిస్టర్, ఆన్‌లైన్ వర్క్ ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలన్నారు. అన్నప్రాసన, సామూహిక సీమంతాలు, పౌష్టికాహారం పట్ల అవగాహన పెంచాలన్నారు. ప్రీ స్కూల్ కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించాలన్నారు. అలాగే అంగన్వాడీ సెంటర్లలో సామూహిక సీమంతాలు నిర్వహించారు. పరిపూర్ణ పౌష్టికాహారంతో సుఖప్రసవాల దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం సామూహిక సీమంతాలు చేశారు. తర్వాత అనారోగ్య కారణంగా ఇబ్బంది పడుతున్నా విధులను విస్మరించక వందశాతం పనితీరులో ముందున్న అంగన్వాడీ కార్యకర్త తిరుపాలమ్మను ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో సిడిపిఒ భారతి, సూపర్‌వైజర్ మధుమాలిని, అంగన్వాడీలు సుధామణి, వెంకటలక్ష్మి, తిరుపాలమ్మ, త్రునిత, తదితరులు పాల్గొన్నారు.



గర్భిణులకు సీమంతం చేస్తున్న స్త్రీశిశు సంక్షేమ శాఖ పీడీ శ్రీదేవి

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలేవీ?

అధికారులపై కౌన్సిలర్ల ఆగ్రహం

ప్రజాశక్తి-గుత్తి

మున్సిపాలిటీ పరిధిలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారం కోసం ఏఏ చర్యలు చేపట్టారో చెప్పాలని పలువురు కౌన్సిలర్లు మున్సిపల్ అధికారులను ప్రశ్నించారు. ప్రతి కౌన్సిల్ సమావేశంలో చెబుతున్న అధికారులు పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని సభ మందిరంలో ఛైర్‌పర్సన్ డి.వన్నూరుబీ అధ్యక్షతన సాధారణ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. సమావేశం ప్రారంభం కాగానే కౌన్సిలర్లు నదీముల్లా ఫారూఖ్, అరవింద్, వరదరాజులు, నరేష్, రమణ మాట్లాడుతూ వేసవి కాలం వచ్చిందని తాగునీటి సరఫరాకు ముందస్తు చర్యలు చేపట్టకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. తాగునీటి సరఫరా కోసం ప్రణాళికలు ఎందుకు రూపొందించడం లేదని వైస్ ఛైర్‌పర్సన్ బి.వరలక్ష్మి ప్రశ్నించారు. తాగునీటి సంబంధించిన విద్యుత్ మోటార్లు మరమ్మతులు చేయాలంటే నిధులు లేవనడం భావ్యం కాదన్నారు. ప్రజల నుంచి వసూలు చేసిన పన్నుల సొమ్ము ఎక్కడికి వెళ్తోందని నిలదీశారు. అధికారులు ప్రజా సమస్యలను గాలికి వదిలేసారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ అధికారుల వద్ద చిత్తశుద్ధి లోపించింది అన్నారు. తమ వార్డుకు 27 రోజులుగా ఉప్పునీరు కూడా సరఫరా కావడంలేదని నీళ్లు లేకుండా ప్రజలు ఎలా బతికేదని కౌన్సిలర్ ఖాజాఖాన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ మురళీధర్, డిఇ రఘు, ఎఇ సాయినాథ్, శానిటరీ ఇన్స్‌పెక్టర్ రంగయ్య, ఆర్ఓ వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



అధికారులను నిలదీస్తున్న కౌన్సిలర్లు

ప్రగతిని చూసి ఓటేయండి

ఎంపీ తలారి రంగయ్య

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చాక చేసిన ప్రగతిని చూసి ప్రజలు ఓటు వేయాలని ఎంపీ తలారి రంగయ్య విజ్ఞప్తి చేశారు. గురువారం మండలంలోని సిబాయి గ్రామంలో, గోళ్ల ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సిబాయి గొల్ల పాత చెరువు, కొండాపురం కృషి కొట్టాల గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ చేపట్టిన సంక్షేమ పథకాలను ఇంటింటా తెలియజేస్తూ ప్రజలకు అభివాదం చేశారు. నవరత్నాలు వైఎస్ఆర్ పెన్షన్, ఆసరా, డ్వాక్రా మహిళలకు సున్నా వడ్డీ, రైతులకు సున్నా వడ్డీ తదితరాలతోపాటు వివిధ పథకాలు, వాటి ఫలాలను వివరిస్తూ ముందుకు సాగారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరసాపురం ఎంపిటిసి సురేష్‌బాబు, మున్సిపల్ కౌన్సిలర్ ఆనందప్ప గారి సురేష్, తదితరులు పాల్గొన్నారు.



సిబాయి గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీ తలారి రంగయ్య

దుకాణాల్లో తనిఖీలు

ప్రజాశక్తి-అనంతపురం

లీగల్ మెట్రాలజీ కర్నూలు జోన్ డిప్యుటీ కంట్రోలర్ చల్లా దయాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల అసిస్టెంట్ కంట్రోలర్లు, ఇన్స్‌పెక్టర్లు గురువారం అనంతపురంలోని పలు ఐరన్, బియ్యం, కిరాణా దుకాణాలపై దాడులు నిర్వహించారు. ఇందులో భాగంగా ఐరన్ దుకాణాల్లో ముద్ర లేని కాటాలు వాడుతున్నందుకు మూడు కేసులు, అధిక ధరలకు తినుబండారాలను విక్రయిస్తున్నందుకు ఆరు, ప్యాకెజీ వస్తువులపై తయారీదారుని పూర్తీ చిరునామా, తయారైన నెల, సంవత్సరం తదితర చట్టపరమైన వివరాలు ముదిరించకపోయినందుకు 3 కేసులు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ తనిఖీల్లో అనంతపురం లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ పి.సుధాకర్, కర్నూలు లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ రాముడు, గుంతకల్లు లీగల్ మెట్రాలజీ ఇన్స్‌పెక్టర్ వై.జి.శంకర్, అనంతపురం లీగల్ మెట్రాలజీ ఇన్స్‌పెక్టర్ మహమ్మద్‌గౌస్, అధికరాఉలు అనిత, పరమేశ్వరకుమార్, వరప్రసాద్, కెఎస్.ఖాజాహుసేన్, తదితరులు పాల్గొన్నారు.



ఇనుము దుకాణాన్ని తనిఖీ చేస్తున్న లీగల్ మెట్రాలజీ అధికారులు

'నవరత్నాలు' కొనసాగాలంటే మళ్లీ జగనే రావాలి

నియోజకవర్గ సమన్వయకర్త ఎం.వీరాంజనేయులు

ప్రజాశక్తి-శింగనమల

రాష్ట్రంలో పేదలకు మేలు జరగాలన్నా.. నవరత్నాల పథకాలు కొనసాగాలన్నా తిరిగి జగనన్న ముఖ్యమంత్రి కావాలని సమన్వయకర్త ఎం.వీరంజనేయులు పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని నిదనవాడ గ్రామంలో పర్యటించిన ఆయన వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగన్ ఎన్నికల ముందు మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక అమలు చేసి చూపారన్నారు. గతంలో చంద్రబాబు ఎన్నికల హామీలను తుంగలో తొక్కి ఏవిధంగా ప్రజలను మోసం చేశారో ప్రజలకు తెలుసు అన్నారు. 2014 నుంచి 2019 వరకూ చంద్రబాబు పాలనలో సంక్షేమ పథకాలను ఎందుకు అమలు చేయలేదో ప్రజలు గుర్తించాలని కోరారు. బాబు మోసపు మాటలు, హామీలను నమ్మి మరోసారి మోసపోవద్దని హితవు పలికారు. జగనన్న చెప్పిన మాట ప్రకారం హామీలన్నీ నెరవేర్చి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి సర్పంచి ఎస్పీ నారాయణరెడ్డి, నాయకులు రామాంజనేయులు, పెద్దిరెడ్డి, చెన్నకేశవులు, వెంకటప్ప, మడుగుపల్లి బయన్న, గురుగుంట్ల వరకూటి ఓబుళపతి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మహిళకు నమస్కరిస్తున్న నియోజకవర్గ సమన్వయకర్త ఎం.వీరాంజనేయులు

ప్రజాశక్తి
www.prajasakti.com

సమస్యలు పరిష్కరించకపోతే గుణపాఠం తప్పదు

కలెక్టరేట్ ఎదుట ధర్నాలో ఉపాధ్యాయ సంఘాల నేతలు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక పెన్షనర్లకు రావాల్సిన ఆర్థిక బకాయిలు, డిఎ అరియర్స్, పిఆర్‌సి తదితర సమస్యలు పరిష్కరించాలని, లేకపోతే వైఎస్ఆర్‌సిపి ప్రభుత్వానికి గుణపాఠం నేర్పుతామని ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్ల సంఘం నేతలు హెచ్చరించారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.సిరాజుద్దీన్ అధ్యక్షతన గురువారం ఏపిటిఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు బి.పెద్దన్నగౌడ్ మాట్లాడుతూ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఉద్యోగ, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు ఇంత పెద్ద ఎత్తున ప్రభుత్వంపై వ్యతిరేకత చూపించి లేదన్నారు. కారణం హక్కులు హరిస్తున్నందుకే అన్నారు. ఉద్యోగులు దాచుకున్న డబ్బులు ఇవ్వరూ, 1వ తేదీన ఉద్యోగులకు వేతనాలు, పెన్షనర్లకు పెన్షన్ అందని దుస్థితి వైఎస్ఆర్‌సిపి ప్రభుత్వ పాలనలో నెలకొందని విమర్శించారు.గుణపాఠం నేర్పే రోజులు దగ్గర పడ్డాయని హెచ్చరించారు. ఏపిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.నరసింహులు మాట్లాడుతూ ప్రభుత్వం దిగొచ్చే వరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శీలా జయరామప్ప, ఏపిటిఎఫ్ జిల్లా గౌరవ సలహాదారులు డి.ప్రభాకర్, ఎన్జీఓ సంఘం నగర అధ్యక్షులు మనోహర్ రెడ్డి, ఏపిటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు సతీష్, ఓబులేసు, రాష్ట్ర కౌన్సిలర్స్ సర్దార్ వలి, వెంకట రమణ, అంజలీ దేవి తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : ఉద్యోగ, ఉపాధ్యాయులకు 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించడంతోపాటు ఒపిఎస్‌ను రద్దు చేయాలని ఎపిటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు సాకే భాస్కర్, జిల్లా పూర్వ ప్రధాన కార్యదర్శి బి.హనుమప్ప డిమాండ్ చేశారు. గురువారం ఎపిటిఎఫ్ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఎన్జీవో ఆధ్వర్యంలో ఉద్యోగ ఉపాధ్యాయుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యతిరేక విధానాలను నిరసిస్తూ తహశీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 12వ పిఆర్‌సి జూలై 2023 నుంచి అమలు చేయాలని, సిపిఎస్ రద్దు చేసి ఓపిఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, జీవో 117ను వెంటనే రద్దు చేయాలన్నారు. అనంతరం రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ రామకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగ సంఘం నాయకులు కిష్టప్ప, ఎపిటిఎఫ్ జిల్లా కౌన్సిలర్ ఇమామ్‌సాబ్, ఉరవకొండ, విడపనకల్ మండల అధ్యక్ష కార్యదర్శులు పాండురంగ, నరసింహులు, నాయకులు దాదాఖలందర్, ఆదినారాయణ, భూమా రామాంజనేయులు, నరసింహులు, నాగేంద్ర, షేక్, శర్మ, కుమైల్, అష్రాఫ్ చౌదరి, రహంతుల్లా, తదితరులు పాల్గొన్నారు.



అనంతపురం కలెక్టరేట్‌లో మాట్లాడుతున్న ఏపిటిఎఫ్‌నాయకులు

తపాలా సేవలను సద్వినియోగం చేసుకోండి



రికార్డులు పరిశీలిస్తున్న తపాలా శాఖ జిల్లా సూపరింటెండెంట్ వి.హరిబాబు

రాయదుర్గం : తపాలా శాఖ అమలు చేస్తున్న చిన్న మొత్తాల పొదుపు, బీమా సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తపాలా శాఖ జిల్లా సూపరింటెండెంట్ వి.హరిబాబు సూచించారు. ఆయన గురువారం పట్టణంలోని సబ్ పోస్టాఫీస్‌ను సందర్శించి కార్యాలయ పనితీరుపై ఆరా తీశారు. ఈ ఆర్థిక సంవత్స రంలోగా కొత్త ఖాతాలు, బీమా పాలసీలు చేయించాలని సూచించారు. ఏజెంట్లతో సమావేశం నిర్వహిం చి ఎక్కువ పొదుపు ఖాతాలు చేయించేందుకు కృషి చేయాలన్నారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో 2 హెడ్ పోస్ట్ ఆఫీస్‌లు, 63 సబ్ పోస్ట్ ఆఫీస్‌లు ఉన్నట్లు తెలిపారు. వీటిలో 5 సబ్ పోస్ట్ మాస్టర్, 2 ఇన్‌స్పెక్టర్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. ఖాళీల భర్తీకి నియామకాలు జరుపుతున్న ట్లు తెలిపారు. స్థానిక పోస్ట్ ఆఫీస్‌ను విశాలమైన మరో భవనంలోకి మార్చేందుకు, సౌకర్యాల కల్పనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. రద్దు చేయబడిన బజార్ పోస్ట్ ఆఫీస్‌ను తిరిగి ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

మున్సిపల్ కమిషనర్ బాధ్యతల స్వీకరణ

రాయదుర్గం : మున్సిపల్ కమిషనర్‌గా గురువారం పి.కిషోర్ బాధ్యతలు స్వీకరించారు. నందికొట్కూరు మున్సిపల్ కమిషనర్‌గా పని చేస్తున్న కిషోర్ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పని చేసిన షేక్ మాలిక్ మున్సిపల్ వ్యవహారాల శాఖ డైరెక్టర్ కార్యాలయానికి బదిలీ అయ్యారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న కమిషనర్ కిషోర్

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మృతిచెందిన రాజేంద్ర

ఉరవకొండ : విడపనకల్ మండల పరిధిలోని హంచనహాల్ గ్రామ సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. మరో ఇద్దరు గాయపడ్డారు. వివరాల్లోకి వెళ్తే... వజ్రకరూరు మండలంలోని కమలపాడుకు చెందిన బోయ ఓబులేసు కుమారుడు బోయ రాజేంద్ర (23) చెల్లెలు అత్త శాంతమ్మను, బేబీ వైష్ణవిని ద్విచక్ర వాహనంలో ఎక్కించుకుని గుంతకల్లు మీదుగా గడేకల్ గ్రామానికి బయలుదేరాడు. హంచనహాల్ గ్రామ సమీపంలోకి రాగానే గుంతకల్లు నుంచి బళ్లారి వైపునకు వెళ్తున్న తమిళనాడు రాష్ట్ర చెందిన లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీకట్టింది. దీంతో రాజేంద్ర అక్కడికక్కడే మృతిచెందాడు. శాంతమ్మ, చిన్నపాప గాయపడ్డారు. లారీ కూడా దాదాపు 20 మీటర్ల దూరం వెళ్లి బోల్తా పడింది. గమణించిన స్థానికులు లారీ డ్రైవర్‌ను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. గాయపడిన వారిని 108 అంబులెన్స్‌లో గుంతకల్లు ప్రభుత్వం ఆసుపత్రికి హుటాహుటిన తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

యువకుడు ఆత్మహత్యాయత్నం

గుత్తి : ప్రేమ పెళ్లి ముందు నుంచి ఇష్టం లేని యువతి తల్లిదండ్రులు, బంధువుల వేధింపులు తాళలేక ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. యువకుడి కుటుంబ సభ్యులు, బంధువులు తెలిపిన వివరాల మేరకు కర్నూలు జిల్లా తుగ్గలి మండలం చిన్న జొన్నగిరి గ్రామానికి చెందిన షాషావలి ఓ యువతిని ప్రేమించి గతేడాది ఫిబ్రవరిలో పెళ్లి చేసుకున్నాడు. యువతి తల్లిదండ్రులకు ఏమాత్ర ఇష్టం లేకపోయినా పారిపోయి పెళ్లి చేసుకుని తమ ఇంటి పరువు తీస్తారో అని భయపడి ఇరువురికి పెళ్లి చేశారు. అయితే ఇప్పుడు చిన్న చిన్న సాకులు చూపుతూ యువకుడిని, అతని తల్లిని దూషిస్తూ, వారి ఇంటి మీద దాడి చేస్తూ, నానా పుకార్లు సృష్టిస్తూ భయ భ్రాంతులకి గురి చేస్తూ వచ్చారు.. ఈ అవమానాలు తట్టుకోలేక మనస్థాపం చెందిన యువకుడు బుధవారం అర్ధరాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలో ఉన్న ఆ యువకుడిని కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం వైద్యుల సూచన మేరకు అతడిని అనంతపురం ఆసుపత్రికి తీసుకెళ్లారు. దీనంతటికీ కారణమైన యువతి తల్లిదండ్రులు, బంధువుల మీద చర్యలు తీసుకుని శిక్ష పడేలా చేసి తమకు న్యాయం చేయాలని యువకుడి తల్లి రోధింస్తోంది.



చికిత్స పొందుతున్న షాషావలి

మద్యం పట్టివేత

పుట్లూరు : మండల పరిధిలోని గరుగుచింతలపల్లి సమీపంలో అక్రమంగా అమ్ముతున్న మద్యాన్ని గురువారం పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన వేమయ్య మద్యాన్ని తీసుకొచ్చి అక్రమంగా అమ్ముతుండగా దాడి చేసి 15 మద్యం బాటిల్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ఇఒకు గాయాలు

యాడికి : అనంతపురం జిల్లా వజ్రకరూరు ప్రధాన రహదారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో యాడికి పంచాయతీ ఇఒ ఎర్రిస్వామి తీవ్ర గాయాలపాలయ్యాడు. ఎర్రిస్వామి ద్విచక్ర వాహనంపై అనంతపురం వైపు వెళుండగా ప్రమాదవశాత్తూ అదుపు తప్పి కిందపడటంతో తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే స్థానికులు అనంతపురంలోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో బెంగళూరుకు తరలించారు.

మహిళ ఇంట్లో చోరీ

బుక్కరాయసముద్రం : ఒంటరి మహిళ ఇంటిలో దోపిడీ చేసిన ఘటన గురువారం మండలంలోని రెడ్డిపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని రెడ్డిపల్లి గ్రామంలో నివాసం ఉంటున్న ఒంటరి మహిళ కుళ్లాయప్ప కూతురు ఎదురు పెద్దక్క బంధువుల ఊరికి వెళ్లింది. గమణించిన గుర్తు తెలియని దుండగులు ఇంటి తలుపు పగులగొట్టి ఇంట్లోని బీరువాలో ఉన్న దాదాపు రూ.4లక్షల వరకూ నగదు ఎత్తుకెళ్లారు. ఊరి నుంచి వచ్చిన పెద్దక్క ఇల్లు తెరిచిచూడగా చోరీ జరిగినట్లు గమణించి బోరున విలపించింది. కూలికి వెళ్లడంతోపాటు తనకు వచ్చిన పింఛన్ సొమ్మును దాచుకుంటే గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారని ఆవేదన వ్యక్తం చేసింది. విసయాన్ని వెంటనే బుక్కరాయసముద్రం పోలీసులకు సమాచారం అందజేసింది. వారు వచ్చి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

'తాడేపల్లి' సభతో 'ప్యాలెస్' నేతల గుండెల్లో దడ

శింగనమల టిడిపి అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ

ప్రజాశక్తి-పుట్లూరు

టిడిపి, జనసేన పార్టీలు సంయుక్తంగా తాడేపల్లిగూడెంలో నిర్వహించిన సభ విజయవంతం కావడంతో తాడేపల్లి ప్యాలెస్‌లో ఉంటున్న వైసిపి నేతల గుండెల్లో దడ పుట్టిందని శింగనమల నియోజకవర్గ టిడిపి అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ అన్నారు. గురువారం అనంతపురంలోని స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రస్తుతం దోపిడీ ప్రభుత్వం సాగుతోందన్నారు. రాష్ట్రంలోని ఐదు కోట్ల మంది ప్రజల భవిష్యత్తు కోసం కోసమే టిడిపి, జనసేన పార్టీలు చేతులు కలిపాయన్నారు. రాష్ట్రాన్ని తిరిగి పూర్వస్థితికి చేర్చాలంటే టిడిపి, జనసేన ప్రభుత్వం రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. జగన్‌రెడ్డి ప్రజల అవసరాలను విస్మరించి, రాష్ట్రాన్ని విధ్వంస పథంలోకి తీసుకెళ్లారన్నారు. సిఎం చెబుతున్న 'వై నాట్ 175' సంగతి దేవుడెరుగు ముందు పులివెందులలో గెలవమని సవాల్ విసిరారు. టిడిపి ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన సూపర్-6తో రాష్ట్ర ప్రజలకు ఎంతో మేలు చేకూరనుందన్నారు. తమ అధినాయకుడు చంద్రబాబు మదిలో మెదలిన బ్లూ ప్రింట్ రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి ఆయువు పట్టు లాంటిదన్నారు. తెలుగుదేశం, జనసేన కలయికతో వైసిపికి ఓటమి తప్పదన్నారు.

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా జగన్ పాలన

ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా జగన్ పరిపాలన కొనసాగుతోందని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. గురువారం అనంతపురంలోని 27, 29 డివిజన్ల పరిధిలో చేపట్టిన 'ఇంటింటికీ వైసీపీ' కొనసాగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుతం తాము ప్రకటిస్తున్న పథకాలను టిడిపి సూపర్ సిక్స్ పేరుతో ప్రకటించిందన్నారు. మేం అమ్మఒడి ఇస్తుంటే తల్లికి వందనం అని పేరు పెట్టుకున్నారని వెల్లడించారు. తెలుగుదేశం, జనసేన ఉమ్మడిగా నిర్వహించిన 'జెండా' సభకు స్పందన అంతంత మాత్రమే వచ్చిందన్నారు. దీంతో చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌కు దిక్కుతోచడం లేదన్నారు. ఈ ఎన్నికల తర్వాత టీడీపీ, జనసేన ఉండవన్నారు. భయపడేవాళ్లంతా తన చుట్టూ ఉండాలని అన్నట్లు పవన్ కళ్యాణ్ మాటలు ఉన్నాయన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజలు ఎంతో శక్తివంతులు అన్నారు. రాజకీయంగా ప్రజాక్షేత్రంలో వైసీపీని ఎదుర్కోలేమని భావించిన చంద్రబాబు, పవన్‌కు ఇద్దరూ కలిసి వస్తున్నారన్నారు. రాష్ట్రంలో ప్రజల మద్దతు జగన్‌కు ఉందన్నారు. మళ్లీ అధికారంలోకి వచ్చేది వైసిపినే అని ధీమా వ్యక్తం చేశారు.



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

మున్సిపల్ మేనేజర్ ఉద్యోగవిరమణ



మున్సిపల్ మేనేజర్ ప్రసాద్ దంపతులను సన్మానిస్తున్న సిబ్బంది

రాయదుర్గం : రాయదుర్గం పురపాలక సంఘంలో పని చేస్తున్న మున్సిపల్ మేనేజర్ ప్రసాద్ స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేసిన సందర్భంగా గురువారం మున్సిపల్ కార్యాలయంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఛైర్‌పర్సన్ పొరాలు శిల్ప హాజరై మేనేజర్‌ని సన్మానించారు. కార్యక్రమంలో కమిషనర్ పి.కిషోర్, కౌన్సిలర్లు లావణ్య, మంజునాథ, శ్రీనివాసరెడ్డి, కోఆప్షన్ సభ్యులు నజీర్, శ్రీనివాసులు, వైసిపి నాయకులు శివ, కృష్ణమూర్తి, శ్రీరామరెడ్డి, నిజాముద్దీన్, అధికారులు కిషోర్, ఈశ్వర్, లక్ష్మీనరసింహులు, మహబూబ్‌బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

జీవులు మనుగడ సాధించేలా పరిశోధనలు ఉండాలి

ఎస్‌కెయు ఆచార్యులు రాజూరు రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

ప్రపంచంలో జీవులు మనుగడ సాధించేలా పరిశోధనలు ఉండాలని శ్రీకృష్ణదేవరాయ ఆచార్యులు రాజూరు రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ఎస్‌వి డిగ్రీ, పీజీ కళాశాలలో భౌతికశాస్త్ర, ఎలక్ట్రానిక్స్ విభాగాల ఆధ్వర్యంలో జాతీయ విజ్ఞాన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతిని బాగా పరిశీలిస్తే మనం కనుగొనాల్సిన విషయాలు ఎన్నో దాగున్నాయన్నారు. ముఖ్యంగా విద్యార్థుల్లో ప్రశ్నించేతత్వం, క్రమశిక్షణ ఉండాలన్నారు. అప్పుడే కొత్త విషయాలు తెలుసుకోవడంతో పాటు ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని పిలుపునిచ్చారు. ఎస్వీ విద్యాసంస్థల ఛైర్మన్ సి.సోమశేఖరరెడ్డి మాట్లాడుతూ విజ్ఞాన శాస్త్రం అనేది ఈ ప్రపంచం గురించి మనకు తెలిసిన విషయాలను ఒక పద్ధతి ప్రకారం వివరించే శాస్త్రమన్నారు. ఈ రంగంలో విద్యార్థులు సమాజానికి ఉపయోగపడే నూతన ఆవిష్కరణలు కనుగొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్‌ఛైర్మన్ సి.చక్రధర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ వై.మధుసూదన్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, ఏవో శ్రీనాథ్, కన్వీనర్ సి.చంద్రశేఖర్‌రెడ్డి, జూలియస్ ఇసాక్ రాజ్, డాక్టర్.పవనకుమారి, ఎస్.పురుషోత్తం, బోధనా బోధనేతర బృందం పాల్గొన్నారు.



ఎస్‌కెయు ఆచార్యులు రాజూరు రామకృష్ణారెడ్డిను సన్మానిస్తున్న ఎస్వీ విద్యాసంస్థల సిబ్బంది



విజయవాడ పార్టీ కార్యాలయంలో దరఖాస్తు అందజేస్తున్న అబ్దుల్‌వహాబ్

కాంగ్రెస్ పార్టీ టికెట్‌కు దరఖాస్తు

రాయదుర్గం : పట్టణానికి చెందిన న్యాయవాది అబ్దుల్ వహాబ్ కాంగ్రెస్ పార్టీ తరపున రాయ దుర్గం టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఆయన బుధవారం విజయవాడలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో తన దరఖాస్తును కార్యాలయ ప్రతినిధికి అందజేశారు. దీంతో దరఖాస్తు చేసుకున్న వారి సంఖ్య 6కు చేరింది.

ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

ఆత్మకూరు : ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ మినీర్ హమద్ హెచ్చరించారు. గురువారం మండల పరిధిలోని కళ్యాణదుర్గం-అనంతపురం ప్రధాన రహదారిపై రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఎవరైనా నిబంధనలను అతిక్రమించినా అతివేగంగా వాహనాలు నడిపినా, లైసెన్స్ లేకుండా ఆటోలు, ట్రాక్టర్లు నడిపినా, ఓవర్ లోడ్‌తో వెళ్లిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి ఒక్క డ్రైవర్ ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ సురక్షిత డ్రైవింగ్ చేస్తూ గమ్యస్థానాలకు చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ ఇబ్బంది పాల్గొన్నారు.



వాహనదారులతో మాట్లాడుతున్న ఎస్ఐ హమద్

ప్రతిగ్రామంలో అభివృద్ధి : ఎమ్మెల్యే తోపుదుర్తి

ప్రజాశక్తి-అనంతపురం

వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రతిగ్రామంలో అభివృద్ధి కనిపిస్తోందని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. గురువారం అనంతపురం రూరల్ మండల పరిధిలోని ఉప్పరపల్లిలో గ్రామ సచివాలయం, రోడ్లు, డ్రెయినేజీ, ఆకుతోటపల్లిలో సచివాలయం, ఆలమూరులో సచివాలయం, వెల్నెస్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చాక చేసిన అభివృద్ధి ప్రతి గ్రామంలో కనిపిస్తుంటే ప్రతిపక్షాలు కనిపించడం లేదన్నారు. ప్రజలు గమణించి వచ్చే ఎన్నికల్లో ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్లు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, ఛైర్మన్లు, డైరెక్టర్లు, గృహ సారథులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, స్టోర్ డీలర్లు, మండల నాయకులు, కార్యకర్తలు, సచివాలయం సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.



సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి




పూజలు చేస్తున్న ఎంపిపి, అర్చకులు, గృహ లబ్ధిదారులు

జగనన్న కాలనీలో గృహప్రవేశ సంబరాలు

ఉరవకొండ : విడపనకల్ మండలం గడేకల్‌లో ఉన్న జగనన్న కాలనీలో గురువారం నూతన గృహప్రవేశ సంబరాలు నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామానికి చెందిన మఠం భీమకవి గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈకార్యక్రమంలో విడపనకల్లు ఎంపిపి కరణం పుష్పావతి భీమిరెడ్డి, మాజీ సర్పంచులు, వైసిపి సీనియర్ నాయకులు కరణం భీమిరెడ్డి, మేకల పంపాపతి, నాయకులు హంపయ్య, కేశవులు, ఉమాశంకర్, తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు ప్రదానం

పామిడి : సైన్స్ దినోత్సవం సందర్భంగా స్థానిక టి.సి. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు రామ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ పోటీల విజేతలకు గురువారం బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు రామ్‌కుమార్ మాట్లాడుతూ కేవలం విద్యార్థులు విద్యకు మాత్రమే పరిమితం కాకుండా తమలో దాగి ఉన్న సృజనాత్మక శక్తికి పదును పెట్టేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయన్నారు. సైన్స్ ఉపాధ్యాయుడు రామాంజనేయులు మాట్లాడుతూ విద్యార్థులకు ఇలాంటి పోటీలు నిర్వహించి బహుమతులు అందజేయడం ద్వారా వారిలో ఉత్సాహం, ఉల్లాసాన్ని నింపుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

కాంగ్రెస్‌తోనే రాష్ట్రాభివృద్ధి

ప్రజాశక్తి-బెలుగుప్ప

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ద్వారానే అన్నివిధాలా అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొడపాటి రామానాయుడు తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని ఎర్రితాత ఆలయంలో సిపిఎం, సిపిఐ నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో వైసిపి పాలనపై ప్రజలు విసుగు చెందారన్నారు. దీంతో ప్రజలు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతున్నారన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, రైల్వేజోన్‌తోపాటు పెద్ద పరిశ్రమలు రావాలన్నా, పరిశ్రమలు ప్రయివేటుపరం కాకుండా ఉండాలన్నా కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రతి పేద కుటుంబానికీ రూ.5వేల పింఛన్ ఇవ్వనున్నట్లు తెలిపారు. దీంతోపాటు రైతు రుణమాఫీ, మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం తదితర వాటిపై ఎన్నికల ప్రణాళిక సిద్ధం చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల కన్వీనర్ బాబుసా, సిపిఎం కార్యదర్శి భీమన్న, సిపిఐ నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పొడుపాటి రామనాయుడు

పోలేరమ్మ విగ్రహ ప్రతిష్టాపన



నార్పల : మండల కేంద్రంలోని కోటవీధిలో వెలసిన పురాతన పోలేరమ్మ అమ్మవారి ఆలయంలో గురువారం నూతన విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించడంతోపాటు భారీ ఎత్తున అన్నదానం చేశారు. ఇక నుంచి పోలేరమ్మ ఆలయంలో నిత్య నివేదనతోపాటు పూజలు పూజలు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శివక్రిష్ణ ఛారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ మెల్లంపూటి శివకృష్ణచౌదరి, తండ్రి మెల్లంపూటి సూర్యప్రకాష్ అమ్మవారుని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో తోట సద్గురు మూర్తి, ప్రసాద్‌నాయుడు, తోట రామకృష్ణ, ఇండ్ల చిన్నరాముడు, కొండిశెట్టి ప్రవీణ్‌కుమార్, నాగేంద్ర, బ్రహ్మ, విజయ్, టైగర్ అమ్మా, రహమతుల్లా, గంజిగుంట ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

5వ తరగతి ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

నార్పల : మహాత్మా జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 2024-25 సంవత్సరానికి 5వ తరగతి ప్రవేశానికి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసినట్లు కన్వీనర్ పి.ఎం.కె. సంగీతకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 15 బిసి గురుకుల పాఠశాలలు ఉన్నాయన్నారు. వాటిల్లో 400 బాలుర, 560 బాలికల సీట్లను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. బాలికలకు నార్పల, గోనబావి, డి హిరేహాల్, గుడిబండ, బుక్కపట్నం, టేకులోడు, నసనకోట పాఠశాలల్లో, బాలురకు కొనకొండ్ల, కుందుర్పి, లేపాక్షి, రేగాటిపల్లి, పేరూరు, రొద్దం.1, 2, గుండుమల పాఠశాలల్లో ఉన్న ఖాళీలను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు.

కంపచెట్ల తొలగింపు

ఉరవకొండ : విడపనకల్ మండల పరిధిలోని హంచనహాల్ గ్రామంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న కంపచెట్లను సర్పంచి పార్వతి కేసన్న ఆధ్వర్యంలో గురువారం తొలగించారు. రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు పెరగడంతో ప్రయాణికులు, గ్రామస్తులు ఇబ్బందులు పడేవారు. విషయం తెలుసుకున్న సర్పంచి జెసిబి ద్వారా తొలించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు ఆడివప్ప, ఓంకారప్ప, వన్నూరుస్వామి, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.



కంపచెట్లను తొలగిస్తున్న జెసిబి

నేడు 'భవిష్యత్తుకు గ్యారెంటీ'

ప్రజాశక్తి-ఉరవకొండ

విడపనకల్ మండలంలో శుక్రవారం 'బాబు షూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించనున్నట్లు టిడిపి నాయకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో పర్యటించి ప్రభుత్వం వైఫల్యాలను వివరించడంతోపాటు టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేయనున్న పథకాలను ప్రజలకు వివరించనున్నట్లు తెలిపారు. కావున కార్యక్రమానికి మండలంలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.